రిజర్వేషన్ పరేషాన్..!


రోటరీనగర్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

రోటరీనగర్‌లో రి(క్వెస్ట్)జర్వేషన్ స్టాప్ లేక అవస్థలు

- ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్థానికులు
- రిజర్వేషన్ చేయించినా కొత్త బస్టాండ్‌కు రావాల్సిందే
- రాత్రి వేళ అధిక చార్జీలు వసూలు చేస్తున్న ఆటోవాలాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండడంతో ఆర్టీసీకి రోజురోజుకు రద్దీ పెరుగుతోంది. ఇక నగరంలోని ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులు అన్ని రకాల సర్వీసులను కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌తో పాటు కాల్వొడ్డున ఆపేలా చర్యలు చేపట్టడంతో త్రీటౌన్ ప్రాంత వాసులకు సౌకర్యవంతంగా మారింది. దీంతో వీరికి బస్టాండ్ వరకు వెళ్లి బస్సు ఎక్కి, దిగే పరిస్థితి లేదు. అయితే నగరం విస్తరణ, రోటరీనగర్, ఇందిరానగర్, మమత రోడ్డు, శ్రీశ్రీ సర్కిల్ వరకు నివాసాల సంఖ్య పెరిగి అధిక జనాభా పెరిగింది. అక్కడ నుంచి ఆర్టీసీ ద్వారా ప్రయాణించే ప్రయాణికుల కోసం రోటరీనగర్, ఇందిరానగర్‌లో రిక్వెస్ట్ స్టాప్‌లు ఉన్నప్పటికీ, రిజర్వేషన్ బస్సు సర్వీసుల స్టాప్‌లు మాత్రం లేవు. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు బస్సు ఎక్కాలంటే ఖమ్మం కొత్త బస్టాండ్ వరకు రావాల్సి వస్తోంది.

రిజర్వేషన్ స్టాప్‌కు ఎదురుచూపులు..

రోటరీనగర్‌లో ఆర్టీసీ రిజర్వేషన్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా స్థానికులు కోరుతున్నారు. సత్తుపల్లి, మధిర, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం డిపోల నుంచి వచ్చే రిజర్వేషన్ బస్సులను రోటరీనగర్‌లో ఆపితే అక్కడ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండి అక్కడే ఎక్కి, దిగేందుకు వీలుంటుంది. ఇకనైనా స్థానిక ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని రోటరీనగర్‌లో ఆర్టీసీ రిజర్వేషన్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడుతున్నారు.

రిజర్వేషన్ ఉన్నా తప్పని తిప్పలు..

నగరంలోని రోటరీనగర్, పోలీస్ హౌజింగ్ కాలనీ, ఇందిరానగర్, విజయనగర్‌కాలనీ తదితర కాలనీ వాసులు నిత్యం పదుల సంఖ్యలో హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకుంటారు. ఇక సెలవులు, ప్రత్యేక రోజుల్లో విద్యార్థులు, ఉద్యోగులు భారీగానే ఆర్టీసీ బస్సుల్లో ఆయా ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారు. అయితే ఈ ప్రాంతంలో ఆర్టీసీ రిజర్వేషన్‌కు సంబంధించి స్టాప్ లేకపోవడంతో.. సీటు రిజర్వేషన్ చేయించుకున్నా.. కొత్త బస్టాండ్‌కు వెళ్లి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. ఈక్రమంలో అర్ధ రాత్రి వేళ రిజర్వేషన్లు చేయించుకున్న వారు కొత్త బస్టాండ్‌కు వెళ్లేందుకు సరైన ఆటోలు లేక, ఉన్న ఒకటి రెండూ ఆటోలు వందల రూపాయలు కిరాయి అడుగుతున్నారన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టాప్ ఉంటే బాగుంటుంది..

రోటరీనగర్ ప్రాంతం కేంద్రంగా ఆర్టీసీ ఆన్‌లైన్ రిజర్వేషన్ స్టాప్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రాత్రయినా, పగలయినా కొత్త బస్టాండ్‌కు వెళ్లాల్సిందే. ఈ ప్రాంతం నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకుని హైదరాబాద్, బెంగుళూరు నగరాలకు వెళ్లి వస్తున్నారు. ఇకనైనా ఇక్కడ స్టాప్‌ను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌కె.ముస్తఫా, ఖమ్మం

క్లుప్తంగా

ఎంట్రీ, ఎగ్జిట్ ఇచ్చే వరకూ ఆందోళన


సంఘీభావం ప్రకటిస్తున్న ఆచార్లగూడెంవాసులు

నేలకొండపల్లి: నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా ఎగ్జిట్, ఎంట్రీ ఇవ్వాలని కోరుతూ ఆప్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పసుమర్తి శ్రీనివాస్ బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సీపీఎం, ఆప్, కాంగ్రెస్, బీఆర్ఎస్, మాస్‌లైన్ పార్టీ నాయకులు తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్ర కలిగిన ప్రదేశాలు, వ్యాపార కేంద్రంగా ఉన్న మండల కేంద్రంలో ఎగ్జిట్ ఇచ్చే వరకూ దీక్ష కొనసాగిస్తామని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే స్వీపర్లు, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఇఫ్టూ పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు చట్టం ప్రకారం ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్, హిరాలాల్, సైదా వాలీ, వీరాకుమారి, కమలమ్మ, యశోద, ఆనంద్ పాల్గొన్నారు.

బిల్లు రాజ్యాంగ విరుద్ధం

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ భూముల ముసాయిదా బిల్లు ఇటు ముస్లింలకు అటు రాజ్యాంగ విరుద్ధమని బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.వలీ తెలిపారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కావాలనే కార్పొరేట్ సంస్థల వ్యక్తులకు వక్ఫ్ భూములను కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. ముస్లింలపై బీజేపీలోని కొందరి నాయకుల దుశ్చర్యల వలన పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లు నబీ ప్రకటించారు.

అన్నం ఆశ్రమానికి బియ్యం



బియ్యం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రమానికి కొల్లా వెంకట భుజంగరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.50 వేల విలువైన 10 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని బుధవారం ఆయన కుమారుడు రఘురాం వితరణగా అందించారు. అనాథల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ఈ వితరణ చేసినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సామాజికవేత్త కడవెండి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయాలు

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరంలో మామపై అల్లుడి అన్న రోకలిబండతో దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎ.ఎల్లయ్య తన భార్యను మందలించడంతో ఆమె పక్కనే నివాసముండే తండ్రి రాములుకు తెలియజేసింది. దీంతో మందలించేందుకు వచ్చిన రాములుపై ఎల్లయ్య అన్న భద్రయ్య రోకలిబండతో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలించి, రాములు కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

'రిహాబ్ బుద్ధ' ప్రారంభం



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని జమ్మిబండ సమీపాన రిహాబ్ బుద్ధ పేరిట ఏర్పాటుచేసిన రిహాబిలిటేషన్, వెల్‌నెస్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సెంటర్‌లో ఫిజియోథెరపీనే కాక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజుతో పాటు కమర్తపు మురళి, కంభంపాటి నారాయణరావు, బొల్లికొండ శ్రీనివాసరావు, బిచ్చల తిరుమల్‌రావు, మోత్కూరి నారాయణరావు, వై.రవీంద్రనాథ్, బోడెపుడి అజయ్, కిషోర్‌బాబు, కూరపాటి ప్రదీప్, పెద్దిరెడ్డి సుధీంద్రరెడ్డి, సతీష్, నారాయణచౌదరి, షేక్ ఏడుకొండలు, మానస, గార్లపాటి వెంకటేష్, బితేజ్ కుమార్, విమల అంబటి, కాశీ విశ్వనాథ్, సత్యజిత్ పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిని సందర్శించిన ట్రెయినీ కలెక్టర్


రికార్డులు పరిశీలిస్తున్న మ్రినాల్ శ్రేష్ఠ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని బుధవారం ట్రెయినీ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని పలు విభాగాలను పరిశీలించారు. పీడియాట్రిక్ వార్డుకు వెళ్లి చిన్నారులకు ఏ విధంగా సేవలు అందిస్తున్నారో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఎన్ఆర్‌సీ, మిల్క్ బ్యాంక్‌లను పరిశీలించారు. మిల్క్ బ్యాంక్ ద్వారా ఎవరి వద్ద నుంచి పాలు సేకరిస్తున్నారు.. ఎంత సేకరిస్తున్నారని ఆరా తీశారు. ఈమేరకు పలు విభాగాల్లో రికార్డులను పరిశీలించి అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంసీహెచ్ సూపరింటిండెంట్ బాబు రత్నాకర్, పిల్లల వైద్యుడు పవన్, ఎన్ఆర్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజాత, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులపై డీఈఓ ఆగ్రహం


కొమ్మినేపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ

కామేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం కొమ్మినేపల్లి, ముచ్చర్ల హైస్కూల్‌ను సందర్శించారు. కొమ్మినేపల్లి హైస్కూల్ ఎస్ఏఎస్ ట్రెనింగ్‌ను పరిశీలించి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామకృష్ణ, ఎంఎన్ఓ నాగేశ్వరరావు, హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నివాళి

తిరుమలాయపాలెం: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో వామపక్షవాది సోమిరెడ్డి వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హస్నాబాద్ గ్రామంలో సోమిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సీఐటీయూ మండల కార్యదర్శి వశపంగు వీరన్న హస్నాబాద్, సీపీఎం శాఖ సెక్రటరీ పల్లి రమేష్, తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతిపై..

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పుచ్చకాయల సత్యనారాయణ తండ్రి గురవయ్య(80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. ఈమేరకు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, మలీదు హైమావతి, వెంకటేశ్వర్లు, కిలారు కృష్ణయ్య, అజ్మీరా హరినాయక్, తదితరులు నివాళులర్పించారు.

మాలలు మరో పోరాటానికి సిద్ధం కావాలి


మాట్లాడుతున్న న్యాయవాది రాజశేఖర్

తిరుమలాయపాలెం: మాలలందరూ ఐక్యంగా మరో పోరాటానికి సన్నద్ధం కావాలని ప్రముఖ హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్ అన్నారు. బుధవారం తిరుమలాయపాలెంలో మాల మహానాడు మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలక ప్రజాప్రతినిధులు, నాయకులు మాలలను టార్గెట్ చేసి సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. దీన్ని అధిగమించాలంటే రాష్ట్రంలో మాల సమాజం ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభకు వచ్చిన ప్రతినిధులతో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పప్పుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కాశీమల్ల మహేందర్‌నాథ్, ఉపాధ్యక్షులుగా దామల అశోక్, దోమల సుధాకర్, ఉండేటి ధర్మరాజు, సహాయ కార్యదర్శిగా మెట్టు మధు, దామళ్ల భాస్కర్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, జిల్లా సీనియర్ నాయకుడు మందడి ఇజ్రాయిల్, జర్నలిస్ట్ మోటపోతుల బాబురావు, మాలమానాడు ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టే సుధాకర్, గుమ్మడి కనకరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: పూలే, అంబేడ్కర్ అధ్యాయన వేదిక ఆధ్వర్యాన ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. బుధవారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు అల్లిక వెంకటేశ్వరావు, బానోతు భద్రూనాయక్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ చంద్ర కుమార్, కంచె ఐలయ్యలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందా రామారావు, శ్రీనివాస్‌గౌడ్, రాంబాబు, విజయ్‌కుమార్, సోమరాజు, లింగబోయిన లక్ష్మణ్, మట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో కాయిన్లు తీసుకోలేదని ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురం సమీపాన ఉన్న పెట్రోల్ బంక్‌లో బోదులబండ గ్రామానికి చెందిన హరీష్ అనే వాహనదారుడు రూ.163 పెట్రోల్ కొట్టమన్నాడు. అతడి వద్ద ఉన్న చిల్లర కాయిన్లను చూసి ఫోన్ పే చేస్తే పెట్రోల్ కొడతా అనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. బంక్ సిబ్బంది అసభ్య పదజాలతో దూషించారని ఆరోపిస్తూ సిబ్బంది, యాజమాన్యంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మోటార్ పైపుల చోరీ

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో సాగర్ కెనాల్ పక్కన ఉన్న రామారావు అనే రైతుకు చెందిన మోటార్‌కు చెందిన ఫుట్‌బాల్, పైపులైన్‌ను బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతు పొలానికి నీళ్లు పెట్టేందుకు రాగా.. చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల రాజేశ్వరపురం గ్రామంలో మోటార్లు చోరీకి గురవుతుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: టిప్పర్ ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన వెంకటచారి బుధవారం తన బైక్‌పై నేలకొండపల్లికి వస్తున్నాడు. ఈక్రమంలో నేషనల్ హైవే పనులు జరుగుతున్న బోదులబండ సమీపంలో పని చేసే టిప్పర్ ఆ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో యువకుడుడికి తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంరూరల్: మండలంలోని సాయిగణేష్‌నగర్‌లో గల రాజీవ్ గృహకల్ప నాల్గవ తరగతి ఉద్యోగులు, భద్రాద్రి కాలనీ, వికలాంగుల కాలనీలలో వృద్ధులకు బుధవారం ఉచిత ఆయుర్వేదిక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని క్యాంప్ ఇన్‌చార్జ్, ప్రభుత్వ ఆయుర్వేదిక వైద్యశాల సీనియర్ వైద్యుడు బి.దశరథ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రూ పరీక్షలు చేయించుకున్నపుడే, బాడీలోని ఇతర రోగాలు బయటపడతాయని చెప్పారు. కాగా, ఈ క్యాంప్‌లో మధుమేహం, కీళ్ల నొప్పులు, బీపీ, రక్తహీనత, జలుబు, దగ్గు, చర్మరోగం తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గణపతిరెడ్డి, ప్రకాష్, వెంకటరాజు, హరికుమార్, సురేష్, హిమాంఅలీ, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు..


పిండిప్రోలులో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు, ఎదుళ్లచెరువు తదితర గ్రామాల్లో బుధవారం ముత్యాలమ్మతల్లి బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలను చల్లంగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.


బోనాలతో వస్తున్న న్యూవిజన్ విద్యార్థులు

న్యూవిజన్‌లో..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో బుధవారం బోనాల పండుగను నిర్వహించినట్లు పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ అబాద్ అలీలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పండుగ బోనాల ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'స్వాతంత్య్ర' సందడి..


నగరంలో జాతీయ జెండాలు కొనుగోలు చేస్తున్న జనం


జాతీయ జెండాతో చిన్నారి

నేడు జరగనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు యావత్తు భారతీయం సిద్ధమైంది. ఈసందర్భంగా దుకాణాల్లో మువ్వన్నెల జెండాలు, స్టిక్కర్లు, టోపీలతో దర్శనం ఇస్తుండగా.. వీటిని కొనుగోలు చేసేందుకు జనాలు షాపుల వద్దకు బారులుదీరారు. దీంతో నగరంలో దుకాణాల వద్ద రద్దీ పెరగగా.. పిల్లలు జెండాలతో సందడి చేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


కారులో జాతీయ జెండాతో..

'తిరంగా'పై తపాలా ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: పంద్రాగస్టు నేపథ్యాన 'హర్ ఘర్ తిరంగా'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరంలో తపాలా ఉద్యోగులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించగా.. పలు వీధుల్లో తిరిగి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి, ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్ సుబ్రమణ్యం, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం


స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించిన ఎస్‌బీఐ అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వైరా రోడ్ ఎస్‌బీఐ బ్యాంకులో బుధవారం 22 మంది స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ లింగస్వామి, చీఫ్ మేనేజర్ ప్రశాంత్, పెన్షనర్ విభాగం చీఫ్ మేనేజర్ హైదరాబాద్ బి.పవన్, ఖమ్మం ప్రాంతీయ కార్యాలయం మేనేజర్ కె.రవీందర్, రంగయ్య, షేక్ ఇబ్రహీం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎస్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957